## గవర్నర్, ప్రభుత్వానికి కాగ్ నివేదిక

### 2022 నాటి ఆడిట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని సూచన

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 2022 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి 'తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్యానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవల నిర్వహణ' అంశంపై తయారు చేసిన నివేదికలను మంగళవారం భారత్ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రాష్ట్ర గవర్నర్, ప్రభుత్వానికి పంపింది. ఈ నివేదికలను వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని పంపినట్టు కాగ్ తెలిపింది.

## ఘోష్ కమిషన్ ముందు వెదిరె హాజరు

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరంపై దర్యాప్తు జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా తన వాదనను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మేడిగడ్డ, తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత, ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చడానికి గల కారణాలపై సమాచారాన్ని అందజేసినట్టు చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద 160 టీఎంసీల నీటి లభ్యత ఉందని సీడబ్ల్యూసీ ఆమోదించిందని గుర్తుచేశారు. ఎన్‌డీఎస్‌ఏ ఇప్పటికే ఇచ్చిన రెండు నివేదికలు, వాటిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సమాచారాన్ని ఇచ్చినట్టు వెల్లడించారు.

## రాగల ఐదు రోజులు భారీ వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం దక్షిణ ఒడిశా పరిసరాల్లో ఉన్న అల్పపీడనం ప్రస్తుతం దక్షిణ ఛత్తీస్‌గఢ్‌ను ఆనుకొని విదర్భకు దగ్గరగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో నైరుతి దిశగా వంగి ఉందని పేర్కొన్నది. 19న పశ్చిమ మధ్య ప్రాంతాలను ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, కొత్తగూడెం, జనగాం, ఖమ్మం, నల్గొండ, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదు కానున్నట్టు తెలిపింది.

- నాడు జలకళ

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో నిరుడు చెక్ డ్యామ్‌లు నీటితో కళకళలాడాయి. వర్షాభావ పరిస్థితులున్నా కాళేశ్వర జలాలను ఎదురెక్కించి వాగులు, చెరువులకు జలకళ తీసుకొచ్చింది. 21వ ప్యాకేజీ కింద నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ శివారులోని కప్పలవాగుకు గోదావరిని తరలించింది. తరలివచ్చిన గంగమ్మను చూసి రైతాంగం పులకించింది.

- నేడు ఇసుక దిబ్బలతో వెలవెల

నేడు కాంగ్రెస్ సర్కార్ కాళేశ్వరంలో మోటర్లు నడిపించకపోవడంతో చెక్‌డ్యామ్‌లు నీళ్లు లేక ఇసుక దిబ్బలతో వెలవెలబోయాయి. రేవంత్ సర్కార్‌కు ముందుచూపు లేకపోవడంతో కప్పలవాగు కళ తప్పింది. రైతాంగం ఆకాశంతోపాటు ప్రభుత్వం వైపు ఆశగా చూస్తున్నది. కానీ వారిని పట్టించుకునేవారేరి? కాళేశ్వరం జలాలను తెప్పించే వారేరి? – భీమ్‌గల్

# ప్రేమోన్మాది దాడి బాధితులకు బీఆర్ఎస్ అండ

- అనాథలైన బిడ్డలకు కేటీఆర్ భరోసా
- పార్టీ నుంచి రూ. 5 లక్షల సాయం

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం 16 చింతలతండాలో ప్రేమోన్మాది చేతిలో దారుణహత్యకు గురైన గిరిజనకుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందుకొచ్చారు. నిందితుడు నాగరాజు చేసిన దాడిలో తల్లితండ్రులిద్దరూ శ్రీనివాస్, సుగుణ చనిపోవటంతో ఆ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు దీపిక, మదన్ అనాథలయ్యారు. దాడిలో తీవ్రంగా గాయపడి కోలుకున్న పిల్లలిద్దరినీ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం కేటీఆర్ వద్దకు తీసుకొచ్చారు. కేటీఆర్ వారి ఆరోగ్యం గురించి వాకబు చేసి ధైర్యంగా ఉండాలని చెప్పారు. దీపిక, మదన్‌ల చదువు బాధ్యత తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్ అయిన సుగుణ బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త కావడంతో పార్టీ తరపున కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని చెప్పారు. ఈ కుటుంబానికి భరోసా ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల సాయం అందించాలని కోరారు.

దీపిక, మదన్‌ను ఓదార్చుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

### శ్రీను కుటుంబానికి అండగా ఉంటాం:కేటీఆర్

పాలకుర్తిరూరల్, జూలై 16: జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల గ్రామంలో కోలా శ్రీను (33) మృతితో అనాథలైన ముగ్గురు చిన్నారులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. ఆ కుటుంబానికి వ్యక్తిగతంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కోలా శ్రీనుకు 12 ఏండ్ల క్రితం లలితతో వివాహమైంది. ముగ్గురు ఆడ బిడ్డలు రక్షిత, రిషిత, రితిక జన్మించారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల శ్రీను అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందాడు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండటంతో దహన సంస్కారాలు కూడా జరిపించలేని పరిస్థితి. దీంతో గ్రామస్థులు విరాళాలు సేకరించి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి వడ్లకొండ వినయ్ ట్విట్టర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. వారి కుటుంబాన్ని వ్యక్తిగతంగా ఆదుకుంటామని ట్విట్టర్ వేదికగా హామీ ఇచ్చారు.

## 3.11కోట్ల 'సాయిశ్రీ' ఆస్తులు జప్తు

### ఎస్‌బీహెచ్‌ని మోసగించిన కేసులో ఈడీ చర్య

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : ఎస్‌బీహెచ్(ఇప్పటి ఎస్‌బీఐ)ని మోసం చేసిన కేసులో సాయిశ్రీ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సాగిరాజు సూర్యనారాయణకు చెందిన రూ.3.11కోట్ల స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. నకిలీ పత్రాలు సృష్టించి కల్పిత ఆస్తులను కొలాటరల్ ఆస్తులుగా చూపించి రూ.15కోట్లకు ఎస్‌బీహెచ్‌ను మోసం చేయడంతో బ్యాంకు ప్రతినిధుల ఫిర్యాదు మేరకు సీబీఐ విచారణ చేపట్టింది. మోసం చేసిన సొమ్ములో కొంత ఎండీ, డైరెక్టర్ల ఖాతాలకు తరలించినట్టు విచారణలో తేలింది. సీబీఐ చార్జిషీటు ఆధారంగా పీఎంఎల్‌ఏ కింద కేసు నమోదు చేసిన ఈడీ, పలు దఫాలుగా ఆస్తులను జప్తు చేసింది.

# 33 రకాల సన్నాలకు బోనస్

### జాబితా విడుదల చేసిన వ్యవసాయ శాఖ

హైదరాబాద్, జూలై 16(నమస్తే తెలంగాణ): సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఏఏ సన్నాలకు బోనస్ వర్తిస్తుందనే అంశంపై స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు 33 సన్న రకం ధాన్యాన్ని గుర్తించింది. ఇవే కాకుండా నిబంధనలకు అనుకూలంగా ఉన్నటువంటి మిగిలిన రకాలను కూడా సన్నాలుగానే పరిగణిస్తామని పేర్కొంది. కెర్నల్ ఎల్/బీ రేషియో ప్రకారం సన్నాలను గుర్తించనుంది. గింజ పొడవు 6 మి.మీ , వెడల్పు 2 మి. మీ కన్నా తక్కువగా, ఎల్/బీ రేషియో 2.5 కన్నా ఎక్కువగా ఉంటే సన్నాలుగా గుర్తిస్తామని స్పష్టం చేసింది.

### సన్నాల జాబితా...

సిద్ది(WGL44), కంపాసాగర్ వరి-1(KPS2874), సాంబ మసూరి (BPT 5204), జగిత్యాల వరి-3 (JGL27356), జగిత్యాల వరి-2 (JGL28545), వరంగల్ సాంబ (WGL 14), వరంగల్ సన్నాలు (WGL 32100), జగిత్యాల్ మసూరి (JGL 11470), పొలాస ప్రభ (JGL 384), కృష్ణ (RNR 2458), మానేరు సోనా (JGL 3828), తెలంగాణ సోనా (RNR 15048), వరంగల్ వరి-1119, కునారం వరి-2 (KNM 1638), వరంగల్ వరి-2 (WGL 962), రాజేంద్రనగర్ వరి-4 (RNR 21278), కునారం వరి-1 (KNM 733), జగిత్యాల సన్నాలు (JGL 1798), జగిత్యాల సాంబ (JGL 3844), కరీంనగర్ సాంబ (JGL 3855), అంజన (JGL 11118), నెల్లూరు మసూరి (NLR 34 449), ప్రత్యుమ్న (JGL 17004), సుగంధ సాంబ (RNR 2465), శోభిని (RNR 2354), సోమనాథ్ (WGL 34 7), ఆర్ఎన్ఆర్ 31479 (PRC), కేపీఎస్ 6251 (PRC), జేజీఎల్ 33124 (PRC), హెచ్ఎంటీ సోనా, మారుటేరు సాంబ (MTU 1224), మారుటేరు మసూరి (MTU 1262), ఎంటీయూ 1271.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న జోగినీ శ్యామల

# జోగినీలు, శివసత్తులపై దాడులు దేశ చరిత్రలో లేదు

- దాడికి నిరసనగా మహంకాళికి బోనాలు తీసుకురాం
- ఆ తర్వాత జరిగే అరిష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే బోనాలకు అంతర్జాతీయ ఖ్యాతి
- జోగినీ శ్యామల వెల్లడి

ఖైరతాబాద్, జూలై 16: జోగినీలు, శివసత్తులపై దాడులు చేసిన చరిత్ర ఈ దేశంలోనే లేదని, కానీ బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో తమపై జరిగిందని జోగినీ శ్యామల ఆవేదన వ్యక్తంచేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా జరుపుకొనే బోనాల ఉత్సవాల్లో ఏటా తాము ఆనవాయితీగా పాల్గొంటున్నామని చెప్పారు. బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవంలో పోలీసుల లాఠీచార్జి కారణంగా అమ్మవారికి సరైన నైవేద్యం అందలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ ప్రభుత్వ హయాంలోనూ జోగినీ, శివసత్తులు, పోతురాజులపై లాఠీచార్జీలు జరుగలేదని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అమ్మవారిని దూరం చేశారని మండిపడ్డారు. ఓ వైపు అమ్మవారి కల్యాణం జరుగుతుండగానే మంత్రి కొండా సురేఖ రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు కృతజ్ఞతలు తెలుపాలని అడగడంపై ఈ వేడుకలపై వారికి అవగాహన ఉందా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బోనాల వేడుకలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం లభించిందని గుర్తుచేశారు. దాడిపై ఫిర్యాదు చేసి వారం రోజులైనా ఇంతవరకు సమాధానం రాలేదని, ప్రభుత్వం ఈ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ ఈ ఏడాది ఉజ్జయినీ మహాంకాళి దేవాలయానికి బోనాలు తీసుకువెళ్లడంలేదని ప్రకటించారు. ఆ తర్వాత జరిగే అరిష్టాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన ఆగదని హెచ్చరించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు 15 నుంచి 'ఫ్రీబస్'

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : ఏపీలో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు మంత్రి అనగాని సత్యప్రసాద్ ట్వీట్ చేశారు. తెలంగాణ విధానమే సరిపోతుందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం.

### ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం

ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన క్యాబినెట్ భేటీలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు బిల్లు, కొత్త ఇసుక పాలసీ, ఇతర ప్రతిపాదనలకు మంత్రివర్గ భేటీలో ఆమోదముద్ర వేశారు.

## టీటీడీ జేఈవోగా వెంకయ్య చౌదరి

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) జేఈవోగా 2005 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి వెంకయ్య చౌదరి నియమితులయ్యారు. వెంకయ్య చౌదరిని డిప్యూటేషన్‌పై ఏపీకి పంపేందుకు కేంద్రప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలిపింది. ఆయన డిప్యూటేషన్‌పై మూడేండ్ల పాటు పనిచేయనున్నారు.

## సంక్షిప్త వార్తలు

### స్విగ్గీ, జొమాటోలో మద్యం డోర్ డెలివరీ!

న్యూఢిల్లీ, జూలై 16: నచ్చిన ఫుడ్‌ను స్విగ్గీ, జొమాటోలలో తెప్పించుకున్నట్టే.. ఇకపై మద్యాన్ని (పరిమిత స్థాయిలో) కూడా డోర్ డెలివరీ ద్వారా తెప్పించుకునే రోజు త్వరలో రాబోతున్నది. మనకు నచ్చిన మద్యం బ్రాండ్‌ను ఆన్‌లైన్ యాప్‌లో ఆర్డర్ చేసి పొందవచ్చు! న్యూఢిల్లీ, కర్ణాటక, హర్యానా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళలలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలుజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ-కామర్స్ సంస్థలతో మద్యం తయారీ కంపెనీలు చర్చలు జరుపుతున్నాయని పరిశ్రమ వర్గాలు మంగళవారం మీడియాకు వెల్లడించాయి.

### భారత మార్కెట్‌లోకి ఒబెసిటీ డ్రగ్ టర్‌జెపటైడ్!

న్యూఢిల్లీ, జూలై 16: బరువు తగ్గటంలో అద్భుత ఔషధంగా భావిస్తున్న 'టర్‌జెపటైడ్' ఔషధం.. త్వరలో భారత్‌లోనూ అందుబాటులోకి రాబోతున్నది. భారత్‌లో ఈ ఔషధం అమ్మకాలకు సంబంధించి ఫార్మా కంపెనీ 'ఇలి లిల్లీ'కి కేంద్రం త్వరలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నది. ఈ ఔషధాన్ని ఇండియాలో టైప్-2 డయాబెటిస్ రోగుల చికిత్స కోసం ప్రధానంగా వాడాలని సూచిస్తున్నా, ఒబెసిటీతో బాధపడుతున్న వారికి దీనిని ఉపయోగించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఔషధాన్ని పెద్ద మొత్తంలో తీసుకున్న రోగుల్లో సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా జరిగిన క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. భారత్‌లోని డ్రగ్ రెగ్యులేటరీ నిపుణుల కమిటీ కొద్ది రోజుల క్రితం 'టర్‌జెపటైడ్' ఔషధం అమ్మకాలకు ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం.

### అనారోగ్యకర ఆహారాన్ని నిషేధించండి: యూజీసీ

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థలలో అనారోగ్యకరమైన ఆహార పదార్థాల అమ్మకాన్ని నిషేధించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల కారణంగానే ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్ నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. వీటితో పాటు పలు అసంక్రమిత వ్యాధులకు కూడా ఇవి హేతువుగా మారుతున్నాయని తెలిపింది.

### 'డ్యూటీలో ముస్లింలు గడ్డంతో ఉండటం తప్పుకాదు'

చెన్నై: మతాచారాలకు అనుగుణంగా గడ్డం కలిగి ఉండటం తప్పేమీ కాదని, అలా ఉన్న పోలీసులపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు చేపట్టవద్దని మద్రాస్ హైకోర్టు తమిళనాడు పోలీస్ శాఖను ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయస్థానం 1957 మద్రాస్ పోలీస్ గెజిట్ 1957ను ప్రస్తావిస్తూ ముస్లింలు విధి నిర్వహణలో గడ్డాలతో ఉండవచ్చునని, అయితే కత్తిరించిన, చక్కనైన గెడ్డాలతో ఉండాలని ఆదేశించింది. మక్కా నుంచి వచ్చిన తర్వాత గెడ్డంతో డ్యూటీకి హాజరైన ఒక కానిస్టేబుల్‌పై అధికారులు చర్య తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు గడ్డంతో విధులకు హాజరవ్వటంలో ఎలాంటి తప్పులేదని స్పష్టం చేశారు.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

**No. Y/C. 79/Catg/e-Auction/2024 తేది: 16-07-2024**

PUB/0687

దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్ డివిజన్‌లో దిగువ తెలిపిన ప్రదేశాల కొరకు ఇ-వేలం ద్వారా టెండర్లు కోరుటకు సంబంధించిన ఆక్షన్ కేటలాగ్ దిగువ ఇవ్వబడినది.

| క్ర. సం. | కేటగిరి | కేటలాగ్ నం. | వివరాలు | వేలం తేది | వేలం ప్రారంభ సమయం | వేలం ముగింపు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1 | మల్టీపూర్ పోస్ స్టాల్స్ | HYB-CATG-MPS-01 | కాచిగూడ కర్నూలు సిటీ బాసర | 31/07/24 | 11:00 | 11:50 |
| 2 | పార్కింగ్ | HYB-PRKG-037 | 04 స్టేషన్లు అనగా మలక్‌పేట్ (మెయిన్) అక్కన్నపేట్, గుండ్ల పోచంపల్లి & సఫిల్ గూడ రైల్వే స్టేషన్ల వద్ద పార్కింగ్ లాట్లు ఇచ్చుట | 27/07/24 | 11:00 | 12:00 |
| 3 | పార్కింగ్ | HYB-PRKG-036 | సిద్దిపేట రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ లాట్ ఇచ్చుట | 24/07/24 | 11:00 | 11:30 |

A0876 సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్/హైదరాబాద్


# మళ్లీ చలో ఢిల్లీ

మరోసారి ఢిల్లీ ర్యాలీకి సిద్ధమైన రైతు సంఘాలు

శంభు వద్ద బారికేడ్లను తొలగించగానే ముందుకు

డిమాండ్లు సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదు

బీకేయూ నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ స్పష్టీకరణ

చండీగఢ్/ఛత్రపతి శంభాజీనగర్, జూలై 16: దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుల 'ఢిల్లీ చలో' సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో హర్యానాలో అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇతర దిగ్బంధనాలను తొలగించిన తర్వాత.. మరోసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టేందుకు రైతు సంఘాలు సిద్ధమయ్యాయి. శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిని తెరిచిన వెంటనే రైతులు మళ్లీ చలో ఢిల్లీ చేపడుతారని భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా సిద్ధూపూర్, సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్) నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మంగళవారం వెల్లడించారు. పంటలకు కనీస మద్దతు ధర, ఇతర డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు రైతాంగ ఉద్యమం ఆగేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని శంభు సరిహద్దు వద్ద రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలని పంజాబ్-హర్యానా హైకోర్టు ఇటీవల హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో దల్లేవాల్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఫిబ్రవరిలో ఎస్కేఎం(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో'ను పోలీసులు పంజాబ్-హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద అడ్డుకోవడంతో ఆ నెల 13 నుంచి రైతులు అక్కడే బైఠాయించి ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

### జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో..

ర్యాలీగా ఢిల్లీ చేరిన తర్వాత జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో శాంతియుత ఆందోళనలు కొనసాగిస్తామని జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వెల్లడించారు. బారికేడ్ల తర్వాత తాము కొనసాగించే ర్యాలీని మళ్లీ అడ్డుకొన్నా, రోడ్డును దిగ్బంధించినా ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చిలో ఆందోళనల సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన నవదీప్ సింగ్‌కు సంఘీభావంగా బుధ, గురువారాల్లో శాంతియుత ఆందోళనలు చేపడుతామని తెలిపారు. నవదీప్ సింగ్‌పై పోలీసులు అల్లర్లు, హత్యాయత్నం వంటి తీవ్రమైన అభియోగాలు మోపారు. హైకోర్టు ఆదేశాలను హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయడంపై దల్లేవాల్ స్పందిస్తూ.. రోడ్డును బ్లాక్ చేసింది ప్రభుత్వమేనని, రైతులు కాదని అన్నారు. ఫిబ్రవరిలో రైతులు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించిన రైతు శుభకరణ్ సింగ్ మృతిపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన కమిటీపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

## ఎంఎస్పీ పెంచక ఇబ్బందుల్లో చక్కెర పరిశ్రమ

కేంద్ర ప్రభుత్వం గత ఐదేండ్లుగా మద్దతు ధరను పెంచకపోవడంతో దేశంలోని చక్కెర పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని షుగర్ యూనిట్స్ ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ డైరెక్టర్ జైప్రకాశ్ దండేగోంకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోకపోవడంతో షుగర్ ఇండస్ట్రీలో వర్కింగ్ క్యాపిటల్‌లో స్వల్ప మార్జిన్లు, అప్పులు వంటి సమస్యలు మళ్లీ తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చెరకు ఎఫ్ఆర్‌పీని మూడుసార్లు పెంచిందని, అయితే చక్కెరకు ఎంఎస్పీని పెంచలేదని పేర్కొన్నారు. గత ఐదేండ్లుగా అన్ని రాష్ట్రాల ఫెడరేషన్లు డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదని విమర్శించారు. చెరకు, రవాణా, లేబర్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో చక్కెర ఉత్పత్తి ఖర్చుగా కేజీకి కనీసం రూ.41 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# ఒమన్ తీరంలో ఓడ బోల్తా

- 16 మంది ఆచూకీ గల్లంతు
- వీరిలో 13 మంది భారతీయులు

మస్కట్, జూలై 16: ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్లతో ప్రయాణిస్తున్న ప్రెస్టీజ్ ఫాల్కన్ అనే ఓడ సోమవారం బోల్తా పడింది. ఈ ఓడలో ఉన్న 16 మంది సిబ్బంది గల్లంతయ్యారని ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్(ఎంఎస్‌సీ) తెలిపింది. ఇందులో 13 మంది భారతీయులు కాగా, మరో ముగ్గురు శ్రీలంకకు చెందిన వారుగా గుర్తించారు. వీరి ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నది. కొమొరోస్‌కు చెందిన ఈ ఓడ యెమన్‌లోని ఓడరేవు నగరమైన ఏడెన్‌కు వెళ్తున్నట్టు తెలిసింది. రాయ్ మద్రకహ్‌కు ఆగ్నేయం వైపు 25 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఓడ బోల్తా పడటానికి కారణం ఇంకా తెలియరాలేదు. ఓడ ఆచూకీ కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి.

### మస్కట్‌లో మసీదు వద్ద కాల్పులు.. భారతీయుడు మృతి

మసీదు లక్ష్యంగా ఒమన్ రాజధాని మస్కట్‌లో దుండగులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరు భారతీయుడు, నలుగురు పాకిస్థానీయులు ఉన్నారు. కాల్పులకు పాల్పడ్డ వారిలో ముగ్గురు దుండగులను కాల్చి చంపినట్టు పోలీసులు తెలిపారు. వాడీ కబీర్ ప్రాంతంలోని ఇమామ్ అలీ మసీద్ బయట సోమవారం రాత్రి స్థానికులు మతపరమైన వేడుక జరుపుకుంటుండగా ఈ కాల్పులు జరిగాయి. మృతి చెందిన భారతీయుని కుటుంబానికి సహాయ సహకారాలను అందించనున్నట్టు భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

## కూలీలుగా వేషం మార్చి.. దొంగల ముఠా ఆట కట్టించి

- పుణె పోలీసుల రహస్య ఆపరేషన్
- చోరీకి గురైన 100 బైకులు స్వాధీనం

ముంబై, జూలై 16: వ్యవసాయ కూలీలుగా మారు వేషం ధరించిన పోలీసులు, పుణె చుట్టుపక్కల వాహనాల్ని దొంగలిస్తున్న ముఠాను అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. గత ఏడాది మార్చి-ఏప్రిల్‌లో పుణె పోలీస్ క్రైం బ్రాంచ్‌లోని ఏడుగురు సభ్యులు రహస్య ఆపరేషన్ చేపట్టి.. దొంగల ముఠాలో ప్రధాన వ్యక్తి అజయ్ రమేశ్ షిండేను పట్టుకున్నారు. దొంగతనం చేసిన 100 బైకులను స్వాధీనం చేసుకొని.. నెల రోజులపాటు ఆరా తీయగా, ఓ కామర్స్ గ్రాడ్యుయేట్ నేతృత్వంలో నలుగురు వ్యక్తులు గ్యాంగ్‌గా ఏర్పడి చేస్తున్న తతంగం బయటపడింది. దొంగలించిన వాహనాల్ని దారాశివ్, లాతూర్, బీడ్ జిల్లాల్లో గ్రామస్థులకు అమ్ముతున్నట్టు పోలీసు విచారణలో తేలింది. రహస్య ఆపరేషన్‌లో భాగంగా కూలీలుగా మారిన పోలీసులు.. పొలాల్లో వంట చేసుకుంటూ, స్థానికులతో కలిసి కొన్ని సార్లు కూలి పనులకు కూడా వెళ్లారని తెలిసింది.

## యూపీలో ముదురు